దిశ తరహా యాప్‌లతో రక్షణ కల్పించాలి



ప్రభుత్వ వైద్యశాలల్లో నిఘా వ్యవస్థలను పటిష్టం చేయాలి. వైద్యశాలల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. దిశ తరహా ఆధునిక యాప్‌లతో రక్షణ కల్పించాలి. రాత్రి వేళల్లో విధి నిర్వహణలో ఉన్న మహిళా సిబ్బందికి ప్రత్యేక భద్రత కల్పించాలి. ప్రభుత్వాలు అబలల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కోల్‌కతా హత్యాచార ఘటనలో నిందితులను తక్షణం కఠినంగా శిక్షించాలి.

–సీహెచ్ రత్నకుమారి, ఏఎన్‌ఎం, భట్టిప్రోలు

విధుల్లో వైద్య సిబ్బందికి రక్షణ ఇవ్వాలి



ఇటీవల కోల్‌కతా ట్రైనీ డాక్టరుకు జరిగిన విషాద ఘటన తలుచుకుంటే భయమేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక నుంచి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు జరగక ముందే ప్రతి వైద్యశాలలో ప్రభుత్వాలు వైద్యాధికారులకు, సిబ్బందికి రక్షణ ఏర్పాటు చేయటం అవసరం. రాత్రివేళల్లో విధుల్లో ఉండే వైద్య సిబ్బందికి ప్రత్యేక భద్రత కల్పించాలి.

–డాక్టర్ డి.పూజితలక్ష్మి, చిన్నపిల్లల వైద్యనిపుణురాలు, సీహెచ్‌సీ, కొల్లిపర

క్లుప్తంగా

మదర్ థెరిసా జయంత్యుత్సవం

వేమూరు(అమర్తలూరు) పేద ప్రజలకు మదర్ థెరిసా అందించిన సేవలు నిరుపమానమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ నాయకులు తెలిపారు. అమర్తలూరులో మదర్ థెరిసా జయంత్యుత్సవం సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

థెరిసా సేవలు నిరుపమానం



తెనాలి: పట్టణ దైవజనుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బోసురోడ్డులోని కార్యాలయంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుష్టు రోగులతో సహా దీనజనులకు ఆమె చేసిన సేవలు అపారమైనవని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి దైవజనుడు, చిన్నపిల్లలు, వృద్ధులు, అనాథలకు ఆహార వసతి సదుపాయాలను కల్పిస్తున్న సంఘ సేవకుడు జి.ప్యారడైజ్‌ను ఘనంగా సత్కరించారు. బిషప్ జె.ప్రభుదాస్ బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ పి.శామ్యూల్, పాస్టర్ సీహెచ్ ఎబినేజర్, పాస్టర్ జి.దానియేలురాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన



తెనాలిరూరల్: మండల గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలని ఆ పార్టీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రముఖ్ పాండురంగ విఠల్ అన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపథ్యంలో నమోదు ప్రక్రియ గురించి కార్యకర్తలు, నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని అంగలకుదురులో ఏర్పాటు చేశారు. విఠల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వం, పరిపాలనపై దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు చొరవ చూపుతారన్నారు. అధిష్టానం సూచన మేరకు నూరు శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. తెనాలి రూరల్ మండల సభ్యత్వ ప్రముఖ్ పాటిబండ్ల రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి తమిరిశ అనంతాచార్యులు, 18 గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



తెనాలిరూరల్: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని అంగలకుదురు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాణావత్ సీత వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించాయి. మంటల కారణంగా పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సీత కుటుంబం కట్టుబట్టలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి బియ్యం, నిత్యావసరాలు, రూ.ఐదు వేల నగదు అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

30న సీతారామ మందిర ప్రతిష్టా మహోత్సవం

తూములూరు(కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామం అయోధ్యనగర్, ఎస్టీ కాలనీలో ఈ నెల 30న ఉదయం 11.02 గంటలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల నూతన బింబ ప్రతిష్టా మహోత్సవం జ్యోతిష-వాస్తు పండితులు నారాయణం రాజగోపాలాచార్యులు చేతులమీదుగా వేద మంత్రాల నడుమ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా 28న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు మంగళవాద్యం, ప్రార్థన, ఆచార్యవరణం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మేధిని పూజ, అంకురార్పణ, కలశ స్థాపన, 29న ఉదయం 7 గంటల నుంచి మంగళవాద్యం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, అగ్ని స్థాపన, కలశారాధన, ఉక్త హోమం, అక్షిమోచనం, పంచగవ్య, క్షీర, జలాధివాసాలు, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, 7 గంటలకు మంగళవాద్యం, సంకల్పం, అగ్ని ప్రణయనం, సర్వదైవత్యం, శయనాధివాసం నిర్వహిస్తారన్నారు. మూడవ రోజు 30న ఉదయం 7 గంటలకు మంగళవాద్యం, ఎసంకల్పం, అగ్నిప్రణయనం, పుణ్యాహవచనం, కలశారాధన, విశేష హోమాలు, 11.02 గంటలకు స్వామి వారి ప్రతిష్ట అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆబాలగోపాలం మురిసే

బాపట్ల/పిట్టలవానిపాలెం/రేపల్లెరూరల్/భట్టిప్రోలు/కొల్లూరు/నగరం : ఊరూరా సంప్రదాయం 'ఉట్టి'పడింది. విద్యా సంస్థలు, వైష్ణవాలయాలు బృందావనాలను తలపించాయి. రాధామాధవుల వేషధారణల్లో చిన్నారులు మెరిశారు. బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో భక్తిపారవశ్యం వెల్లివిరిసింది. ఆబాలగోపాలం జయ కృష్ణా.. ముకుందా.. మురారీ అంటూ గోవిందుడిని కీర్తించింది. గోపూజలతో తరించింది. బాపట్ల మండలం ముత్తాయిపాలెంలోని శ్రీకృష్ణయాదవ యూత్ ఆధ్వర్యంలో యువకులకు ఉచితంగా టీ షర్టులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఉట్టికొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. రేపల్లె ఓల్డ్‌టౌన్‌లోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. రైలుపేటలోని పట్టాభి రామస్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి. భట్టిప్రోలు అద్దేపల్లిలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రాత్రి మ్యూజికల్ నైట్ ఎంతగానో ఆకట్టుకుంది. నగరంలోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



కొల్లూరులో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



బాపట్లలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



భట్టిప్రోలు అద్దేపల్లిలో పూజలు

వెల్లటూరులో రథోత్సవం



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని గీతా జ్ఞాన మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం భగవద్గీత పారాయణం జరిగింది. అనంతరం కృష్ణభగవానుని రథోత్సవం నిర్వహించారు. కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో గోపికల వేషధారణలో చిన్నారుల నృత్యప్రదర్శన



రేపల్లెలో గోపికాగోపాలురు

విద్యార్థులతో చందాలు వసూలు చేయిస్తే చర్యలు

రేపల్లె రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహించే వేడుకలకు చందాలను విద్యార్థులు, చిన్నారులతో వసూలు చేయిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి కేసనశెట్టి సురేష్ హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల పలువురు చిన్నారులు, విద్యార్థులు చందాల వసూలుకు వెళ్తున్నట్లు తమకు సమాచారం అందిందని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు విద్యార్థులు చందాలకు వస్తే పోలీసు స్టేషన్‌లోగానీ, మండల విద్యావనరుల కేంద్రానికిగానీ సమాచారం అందించాలని కోరారు.

బండ్లమ్మకు వెండి పూజా పాత్ర సమర్పణ



పిట్టలవానిపాలెం: చందోలులో కొలువైన బండ్లమ్మకు గ్రామానికి చెందిన దాత వెండి పూజా పాత్రను సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి మాట్లాడుతూ చందోలు గ్రామానికి చెందిన నీలి చంద్రశేఖరరావు కుమారుడు సత్యఫణికుమార్ రూ.70 వేల విలువ చేసే 730 గ్రాముల బరువుగల వెండిపూజా పాత్రను సమర్పించారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాసరావు,అర్చకులు శ్రీరామశర్మ, కుంచల బళ్ళారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిమదీ దోచే..

- ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు
- చవితి ఉత్సవాలకు సిద్ధం
- కొనుగోలుకు భక్తుల ఉత్సాహం
- మెటీరియల్ ఖర్చు పెరిగిందంటున్న తయారీదారులు



గణేశుని విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు



అందంగా ముస్తాబైన వినాయక ప్రతిమలు

బాపట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో చలువ పందిళ్లలో కొలువుదీరేందుకు గణనాథ ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. వివిధ ఆకృతుల్లో, రూపాల్లో ముస్తాబై మదిమదినీ దోచుకుంటున్నాయి. బాపట్ల పట్టణంలో విగ్రహాల తయారీదారులు భక్తుల అభిరుచికి తగ్గట్టుగా ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. విగ్రహాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తోపాటు పీచు, కర్ర, రంగులు వాడుతున్నారు. ఒక విగ్రహం తయారీకి సుమారు ఎనిమిది మంది కూలీలు శ్రమిస్తున్నారని, పూర్తవడానికి ఐదు రోజుల నుంచి వారం పడుతుందని తయారీదారులు చెబుతున్నారు. విగ్రహాల తయారీ ఖర్చులు పెరిగాయని, ముడి సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని పేర్కొంటున్నారు. తరతరాలుగా ఇదే వృత్తిపై జీవిస్తున్నామని, పెద్దగా ఆర్జించేదేమీ ఉండదని, కూలి గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. బాపట్లలో మొత్తం పది రకాల ఆకృతుల్లో విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. వీటి కొనుగోలుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు.

ఇప్పుడిప్పుడే ఆరంభం



అరు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ ప్రారంభించాం. చాలా వరకు వివిధ ఆకృతుల్లో సిద్ధం చేశాం. కొనుగోలుదారులు ఇప్పుడిప్పుడే అడ్వాన్సులు ఇచ్చి వెళ్తున్నారు. భక్తుల ఆసక్తికి తగ్గట్టు విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– కటివరపు విజయ్ కుమార్, విగ్రహ తయారీదారు

ధరలు బాగా పెరిగాయి



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ద్వారా విగ్రహాలు తయారు చేస్తున్నాం. ఇది మాకు వంశపారంపర్యంగా అబ్బిన విద్య. వినాయక విగ్రహాలు తయారు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. భక్తుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాలను తీర్చిదిద్దుతున్నాం.

– రజనీకుమార్, విగ్రహ తయారీదారు

ధరల పెరుగుదలపై 1 నుంచి నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు శ్రీధర్

బాపట్ల: నిత్యావసరాల ధరలు పేదలను బెంబేలెత్తిస్తున్నాయని, వాటిని తగ్గించాలని సీపీఐ సీనియర్ నాయకులు జెలీభాగ్య శ్రీధర్ డిమాండ్ చేశారు. బాపట్లలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పట్టణ నాయకుడు మామిడి బత్తుల అశోక్ అధ్యక్షతన నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీధర్ మాట్లాడుతూ ధరల నియంత్రణ కోరుతూ సెప్టెంబరు ఒకటి నుంచి ఆరో తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలతోపాటు అన్ని నిత్యావసరాల ధరలూ పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలోలా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసరాలను తక్కువ ధరకే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎం.వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మామిడి బత్తుల గణేష్, డి.ఆంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త 'దారి'ద్ర్యం



ఈ చిత్రంలో చెత్తాచెదారంతో పేరుకుపోయిన ప్రాంతం కాలువ గట్టుకాదు.. సీసీ రోడ్డు. రేపల్లె 24వ వార్డు నేతాజీ నగర్ సమీపంలో ఉన్న ఈ దారిలోనే ఆ ప్రాంత వాసులు రాకపోకలు సాగిస్తారు. ఆదివారం పట్టణంలోని ఓల్డ్ టౌన్ నుంచి రైలుపేట వరకు ఉన్న వాడ మురుగు డ్రెయిన్‌లో పూడిక తీయగా వచ్చిన వ్యర్థాలు, డెక్క, తూటికాడను సిబ్బంది ఇలా ఈ రోడ్డుపైనే పోశారు. దీంతో స్థానికులు చిత్రహింస అనుభవిస్తున్నారు. దుర్గంధంతో విలవిల్లాడుతున్నారు. దోమల బెడద ఎక్కువైందని, వెంటనే చెత్తను ఇక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

– రేపల్లె రూరల్

సురక్షిత ప్రయాణానికి స'వాల్'



శిథిలమైన సైడ్ వాల్ ప్రమాదకరంగా మారి సురక్షిత ప్రయాణానికి సవాలు విసురుతోంది. రేపల్లె మండలం మొల్లగుంట కట్టవ వద్ద వంతెనపై ఉన్న ఓ వైపు సైడ్ వాల్ శిథిలమైంది. వంతెనపై అప్రోచ్ రోడ్డూ గోతులమయమైంది. దీంతో వాహనదారులు రాత్రివేళల్లో ఆ దారిన వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఆదమరిస్తే అంతే సంగతులని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి సైడ్ వాల్ నిర్మించడంతోపాటు వంతెనపై గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

– రేపల్లె రూరల్

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

క్రోసూరు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఊటుకూరు వైద్య శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేయగా ఆరుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు. బయ్యవరంలో 36 మందికి వైద్య పరీక్షలు చేయగా ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాల్లో ఏఎన్‌ఎం లక్ష్మీ, బయ్యవరంలో ఏఎన్‌ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రేమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ శివుడు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ఓక్ బ్రిడ్జి విద్యార్థుల విజయకేతనం

మాచర్ల రూరల్: కృష్ణాష్టమి పండగ పురస్కరించుకుని తెలుగు స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వారు గుంటూరులో నిర్వహించిన పోటీలలో ఓక్ బ్రిడ్జ్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మి తెలిపారు. రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో యు.ఎ.19లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి తీర్థ, 8వ తరగతి అయన్, 3వ తరగతి బాలబోయిన కృష్ణసాయి గౌతమ్‌లు బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ అవసరమని వారి మానసిక, శారీరక దృఢత్వానికి, మైండ్ గేమ్ చెస్‌లో ప్రావీణ్యం సాధించటం పట్ల ఆమె చెస్ కోచ్ కిరణ్‌ని అభినందించారు.

మినుము పైరుకు వైఎంవీ వైరస్



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మినుము పంటను డీడీఏ శివ కుమారి సోమవారం పరిశీలించారు. మినుము పైరుకు వైఎంవీ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఎల్లోవేయిన్ మొసాయిక్ వైరస్ నివారించేందుకు రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. తెగులు సోకిన మొక్కలను తొలగించాలన్నారు. వైరస్ నివారణకు పసుపురంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసెటమీప్రైడ్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీరివెంట ఏడీఏ మస్తానమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

శిఖర ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

తెనాలి: తెనాలిలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వైకుంఠపురం దేవస్థానంలో కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్టా మహాసంప్రోక్షణ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరగనున్న వేడుకల్లో భాగంగా తొలి రోజు విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి భగవత్ ప్రార్థన, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచన, అగ్నిప్రతిష్టాపన, అకల్మష హోమం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గర్భాలయాలు, జీవధ్వజం, నూతన శిఖరాలు, నూతన ఉత్సవ విగ్రహాలకు, ప్రసన్నాంజనేయస్వామి శిలా విగ్రహానికి వాస్తు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల కళాపకర్షణ, నివేదన, నీరాజన, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదగోష్టి, తీర్థప్రసాద వితరణ చేశారు. 28 నుంచి స్వామి, అమ్మవార్ల గర్భాలయాల్లో స్వామి, అమ్మవార్లకు పూజా కైంకర్యాలు యథావిధిగా కొనసాగనున్నాయి.